ప్రజాశక్తి
సోమవారం 11 నవంబర్ 2024
5
కర్నూలు

యురేనియంపై పోరుబాట !

- కప్పట్రాళ్ల సహా 12 గ్రామాల ప్రజల సమరం • తవ్వకాలను అడ్డుకునేందుకు ఏకమైన జనం
- వామపక్షాలు, ప్రజా సంఘాల మద్దతు • నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

పాలెగాళ్లు పాలించిన ప్రాంతంగా, ఫ్యాక్షన్ ప్రాంతంగా చరిత్ర కలిగిన కప్పట్రాళ్ల గ్రామస్తులు తమ ఉనికిని కోల్పోకుండా ఉండేందుకు పోరుబాట పట్టారు. పొంచి ఉన్న అణు ముప్పు కారణంగా తమ ఎలాంటి తవ్వకాలు చేపట్టొద్దంటూ కప్పట్రాళ్లతో పాటు మరో 12 గ్రామాలు నిరసన దీక్షలు చేపట్టారు. యురేనియం నిక్షేపాలను వెలికి తీసేందుకు కేంద్ర ప్రభుత్వం సన్నద్ధమౌతోంది. ఇదే జరిగితే.. పచ్చని పల్లెసీమల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారే అవకాశాలున్నాయి. అణు విద్యుత్ ఉత్పత్తి చేసే ప్రపంచ దేశాల సరసన చేరాలని కేంద్రం యోచనలో ఉంది. యురేనియం వెలికి తీస్తే మానవాళి మనుగడ ప్రశ్నార్థకం కానుందని తెలుసుకున్న ఆయా గ్రామాల ప్రజలు యురేనియం తవ్వకాలను అడ్డుకునేందుకు ఏకమయ్యారు. తవ్వకాలు నిలిపివేసే వరకూ పోరాటం తప్పదని హెచ్చరిస్తున్నారు. ఆందోళనలో భాగంగా సోమవారం కర్నూలు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టనున్నారు...

కర్నూలు జిల్లా దేవనకొండ మండలం కప్పట్రాళ్ల, చెల్లెలి చెలిమల, నల్ల చెలిమిల, గుండ్లకొండ గ్రామాల పరిధిలో 468 హెక్టార్లలో అటవీ భూములున్నాయి. కౌలుట్లయ్యమలగా పిలిచే ఈ రిజర్వు ఫారెస్టు..కప్పట్రాళ్ల, పి.కోటకొండ, మాదాపురం, చెల్లెలచెలిమిల, గుండ్లకొండ్ల గ్రామాల మధ్య విస్తరించి ఉంది. ఒకప్పుడు కప్పట్రాళ్ల కేంద్రంగా పాలెగాళ్ల పాలన సాగింది. ఆంగ్లేయులను గడగడలాడించిన చరిత్రను కలిగిన ఈ ప్రాంతం యురేనియం కారణంగా కనుమరుగు కానుంది. ఈ ప్రాంతానికి యురేనియం ముప్పు పొంచి ఉందని తెలియడంతో గ్రామస్తుల్లో వణుకు మొదలైంది. నాలుగైదేళ్ల క్రితం బంగారు కోసం సర్వేలు చేశారనుకున్న ప్రజలకు కేంద్రం ఊహించని షాక్ ఇచ్చింది. ప్రాణాంతక యురేనియం నిక్షేపాలను వెలికి తీసేందుకు ఈ సర్వేలు చేశారని తెలియడంతో భవిష్యత్ లో జరగనున్న దుష్పరిమాణాలను తలుచుకుని నిర్ఘాంతపోతున్నారు. ప్రస్తుతం ఈ అటవీ ప్రాంతంలో యురేనియం నిల్వలను గుర్తించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మేరకు అటామిక్ మినరల్ డైరెక్టరేట్ ఆఫ్ ఎక్స్ ప్లోరేషన్ అండ్ రీసెర్చ్(ఏఎండీ) 68 బోర్లు వేసేందుకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. ఎలాగైనా యురేనియం తవ్వకాలను అడ్డుకోవాలని, లేకుంటే తమకు ముప్పు తప్పదని భావించిన గ్రామస్తులు తవ్వ కాలను అడ్డుకునేందుకు సిద్ధమయ్యారు. అందులో భాగంగానే రెండ్రోజుల నుంచి కప్పట్రాళ్ల, ఈదుల దేవరబండ, నెల్లిబండ, దుప్పనగుర్తి, జిల్లేడుబుడకల, చెల్లెల చెలిమెల, బండపల్లి, బంటుపల్లి, బేతపల్లికి చెందిన జెఎసి నేతలు, 12 గ్రామాల ప్రజలు సమావేశమై యురేనియం తవ్వకాలను అడ్డుకోవాలని తీర్మానించారు. ఇప్పటికే కర్నూలు - బళ్లారి రహదారిపై రెండు సార్లు బైఠాయించి పోరుబాట చేపట్టారు. సిపిఎం నాయకులు కూడా గ్రామంలో సమావేశం నిర్వహించి యురేనియం ఆందోళనకు మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు. కర్నూలు ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. అందులో తీర్మానించినట్లు సోమవారం కర్నూలు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టనున్నారు.

ఏఏ ప్రాంతాల్లో వ్యతిరేకించారంటే..

- కడప జిల్లా పులివెందుల నియోజకవర్గంలోని వేముల మండలం తుమ్మపల్లె, కేకే కొట్టాల, మొబ్బు చింతపల్లె, రాచకుంటపల్లె, భూమయ్యగారిపల్లె గ్రామాల్లో యూసీఐఎల్ యురేనియం వెలికితీసి శుద్ధి చేసే ప్రక్రియ చేపట్టింది. యురేనియం ప్రభావం వల్ల గాలి, నీరు, భూమి కలుషితమౌతుందని, వీటి ప్రభావం ప్రజలు, పాడి పశువులు, జంతువులపై పడుతుందని శుద్ధి ప్రక్రియను వ్యతిరేకించారు.
- నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ, మహానంది, రుద్రవరం మండలాల్లోని అటవీ ప్రాంతాల్లో 2019లో యురేనియం అన్వేషించారు. అక్కడ బోర్లు వేయబోతే అప్పట్లో స్థానికులు అడ్డుకున్నారు. అలాగే మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, ప్రజా సంఘాల నాయకులు వ్యతిరేకించారు.

యురేనియం తవ్వకాల వల్ల కలిగే నష్టాలు

- యురేనియం కోసం తవ్వకాలు చేస్తే పెద్ద సంఖ్యలో రేడియేషన్ విడుదల అవుతుంది. గాలిలో కలిసే విషపూరిత అణువుల చుట్టూ ఉన్న పర్యావరణాన్ని నాశనం చేస్తాయి. భూమి పై పొరలు పూర్తిగా నాశనమౌతాయి. భూ కాలుష్యం పెరుగుతుంది. చుట్టు పక్కల భూగర్భ జలాలు కూడా కాలుష్యమవుతాయి. యురేనియంను సేకరించిన తర్వాత దాన్ని అత్యంత జాగ్రత్తగా విద్యుత్ ప్లాంట్లకు తరలించాల్సి ఉంటుంది. కానీ అభివద్ధి చెందిన అమెరికా లాంటి దేశాల్లో కూడా ఈ ప్రక్రియ సక్రమంగా జరగడం లేదు. ఫలితంగా గాలిలో యురేనియం అణువులు కలిసి తీరని నష్టం వాటిల్లుతుంది.
- యురేనియం తవ్వకాల్లో ఆర్సెనిక్ అనే ప్రమాదకర లోహం ఒకటి భూగర్భ జలాల్లో కలుస్తుంది. ఇది ఎంత ప్రమాదకరమైనదంటే.. ఆ నీరు తాగితే మనుషులైనా, జంతువులైనా క్షణాల్లో చనిపోతారు.
- 1944-1986 మధ్య అమెరికా దాదాపు 40 లక్షల టన్నుల యురేనియంను సేకరించింది. ఇందుకు సంబంధించిన 500 గనులను పూడ్చివేయకుండా వదిలేసింది. ఫలితంగా ఆ చుట్టుపక్కల చాలా మంది ప్రజలకు లంగ్ కాన్సర్ (ఊపిరితిత్తుల కాన్సర్) సోకింది. ఇలాంటి ఎన్నో నష్టాలు ఉన్నందుకే యురేనియం తవ్వకాలను మేధావులు వ్యతిరేకిస్తున్నారు.

కప్పట్రాళ్ల గ్రామం

తవ్వకాలు చేపట్టాలనుకునే కొండ ప్రాంతం

మైనార్టీల సంక్షేమమే ధ్యేయం

- వక్ఫ్ సంస్థల అభివృద్ధికి కృషి • పేద మైనార్టీలకు అండగా నిలుస్తాం
- ప్రజాశక్తితో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి సబిహా పర్వీన్

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

మైనార్టీల సంక్షేమమే ధ్యేయంగా మైనార్టీ సంక్షేమ శాఖ పని చేస్తుంది. మైనార్టీలకు విద్యతో పాటు అన్ని రకాలుగా అభివృద్ధి చెందే దిశగా చర్యలు చేపడతాం. విద్య, ఉపాధి కోసం చర్యలు తీసుకుంటున్నాం. పేద మైనార్టీలకు అండగా నిలుస్తాం. వక్ఫ్‌యేతర సంస్థల (చర్చిలు) అభివృద్ధి కోసం కూడా పని చేస్తున్నాం. అని ఆ శాఖ జిల్లా అధికారి సయ్యద్ సబిహా పర్వీన్ అన్నారు. ప్రజాశక్తితో ఆమె ముఖాముఖిగా మాట్లాడారు...

మైనార్టీ వెల్ఫేర్ శాఖ పరిధిలో ఏ ఏ విభాగాలు పనిచేస్తున్నాయి?

డిఎండబ్ల్యుఒ: జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఉమ్మడి కర్నూలు జిల్లా పరిధిలో పనిచేస్తుంది. ఈ శాఖలో ప్రధానంగా సంక్షేమ విభాగం, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ విభాగం, ఉర్దూ అకాడమీ విభాగం, హజ్ యాత్ర విభాగం, క్రిస్టియన్ కార్పొరేషన్ విభాగం, బోర్డు విభాగం, సిఇడిఎం విభాగాలు పనిచేస్తున్నాయి.

జిల్లాలో వక్ఫ్ సంస్థల అభివృద్ధికి ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

డిఎండబ్ల్యుఒ: జిల్లాలో వక్ఫ్ సంస్థల అభివృద్ధిలో భాగంగా 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను మసీదులకు వాటి ప్రహరీ గోడలకు ఈద్గాలకు వాటి ప్రహరీ గోడలకు స్మశాన వాటికల ప్రహరీ గోడల నిర్మాణానికి కర్నూలు జిల్లాకు సంబంధించి 13 ప్రతిపాదనలను రూ.36,97,982 అంచనా వ్యయంతో నంద్యాల జిల్లాకు సంబంధించి 16 ప్రతిపాదనలను రూ. 4.33 కోట్ల అంచనాల వ్యయంతో ప్రభుత్వ ఆర్థిక సహాయం మంజూరు కోసం పంపాము.

వక్ఫ్‌యేతర సంస్థల (చర్చిలు) అభివృద్ధి కోసం ఎలాంటి చర్యలు చేపట్టారు?

డిఎండబ్ల్యుఒ: వక్ఫ్‌యేతర సంస్థల (చర్చిలు) అభివృద్ధి కోసం గతేడాది కర్నూలు జిల్లాకు సంబంధించి 15 ప్రతిపాదనలకు గాను రూ.6.43 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు పంపాం. నంద్యాల జిల్లాకు సంబంధించి 8 ప్రతిపాదనలకు గాను రూ.1.89 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు పంపాం. ఇవే కాకుండా నంద్యాల జిల్లాలో మరో తొమ్మిది ప్రతిపాదనలు కూడా వివిధ మండలాల నుంచి పంపాం.

షాదీఖానాల నిర్మాణాలు, నిర్వహణ పట్ల ఏ విధమైన దృష్టిని సారిస్తున్నారు?

డిఎండబ్ల్యుఒ: షాదీఖానాల నిర్వహణకు సంబంధించి నంద్యాల జిల్లా వెలుగోడు మండలం గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న షాదీఖానా నిర్మాణానికి రూ.45 లక్షలు అంచనా వ్యయంతో ప్రతిపాదనలు పంపాం. 2023-24 ఆర్థిక సంవత్సరంలో మహానంది మండలం గాజులపల్లి గ్రామంలో షాదిఖానా నిర్మాణాన్ని రూ.45 లక్షలు అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సమర్పించగా రెండు ప్రతిపాదనలను ఆమోదిందిస్తూ పరిపాలన ఉత్తర్వులు మంజూరు చేశారు.

గత ఏడాది ఎంత మంది మైనారిటీ విద్యార్థులకు ఉపకార వేతనాలను అందించారు..?

డిఎండబ్ల్యుఒ : 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉమ్మడి కర్నూలు జిల్లా పరిధిలో వసతి దీవెన కింద 512 మంది విద్యార్థులకు రూ.2.91 కోట్లు విడుదల చేశాము. విద్యా దీవెన కింద 5070 మంది విద్యార్థులకు రూ. 4.90 కోట్లు విడుదల చేశాము.

ప్రధానమంత్రి జన వికాస్ కింద చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు ఏమిటి?

డిఎండబ్ల్యుఒ: ప్రధానమంత్రి జన వికాస్ కార్యక్రమం కింద 2022-23 ఆర్థిక సంవత్సరమునకు సిరివెళ్ల, చాగలమర్రి, నందికొట్కూరు, ఆత్మకూరు, ఆదోని, నంద్యాల, కర్నూలు పట్టణాల్లో రూ.107 కోట్ల అంచనా వ్యయంతో 13 పనులకు ప్రతిపాదనలను మైనార్టీ సంక్షేమ శాఖ కమిషనర్ వారికి సమర్పించాం. 2015 -16 ఆర్థిక సంవత్సరం నుండి 2019 - 20 ఆర్థిక సంవత్సరంనకు గాను చాగలమర్రి, సిరివెళ్ల, నంద్యాల, ఆత్మకూరు, నందికొట్కూరు మొదలైన మైనారిటీ కాన్సన్ట్రేటెడ్ టౌన్ బ్లాకులలో ప్రధానమంత్రి జనన వికాస్ కార్యక్రమం కింద మంజూరైన పనులు పురోగతిలో ఉన్నాయి. 2018- 19 నుండి 2019 - 20 వరకు కర్నూలు జిల్లాలోని కర్నూలు మండలం, రేమటలో మైనార్టీ బాలుర రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణం కొరకు రూ.18 కోట్లు సహా గ్రామంలో ఐదు సెంట్ల స్థలంలో కేటాయించాం. పనులు ప్రారంభించడానికి చర్యలు చేపట్టాం. ప్రీ మెట్రిక్ బాలుర వసతి గృహ(100 మంది) నిర్మాణం కోసం రూ. 2.10 కోట్లు, పోస్ట్ మెట్రిక్ మైనార్టీ బాలికల వసతి గృహ(100 మంది) నిర్మాణాల కోసం అంచనా వ్యయంతో ప్రతిపాదనలు పంపాం. ఉర్దూ డిగ్రీ కళాశాల భవన నిర్మాణం కోసం కూడా ప్రతిపాదనలు పంపాం. కర్నూలు నగరంలోని గడియారం ఆస్పత్రి వద్ద గల మైనార్టీ జూనియర్ కళాశాల భవనం పైన గాని ఉర్దూ పాఠశాల ప్రాంగణంలో గాని డిగ్రీ కళాశాల నిర్మాణంకి అవకాశం ఉంది. నంద్యాల జిల్లా కు మంజూరైన ఏడు నిర్మాణ పనుల్లో నంద్యాల మండలం మూలసాగరం నందు తలం కేటాయించాం. సదరు పనులు పురోగతిలో ఉన్నాయి. ఈ పురోగతి నిర్మాణ పనుల జాబితాలో ప్రీ మెట్రిక్ మైనార్టీ బాలుర వసతి గహం, పోస్ట్‌మెట్రిక్ మైనార్టీ బాలుర వసతి గృహం, ఉర్దూ జూనియర్ కళాశాల, కామన్ సర్వీస్ సెంటర్, ప్రీమెట్రిక్ బాలికల వసతి గృహం, పోస్ట్ మెట్రిక్ బాలికల వసతి గృహం, వర్కింగ్ ఉమెన్ హాస్టల్ నిర్మాణ పనులు ఉన్నాయి.

ఉద్యోగ భద్రత కల్పించాలి

- కలెక్టరేట్ ఎదుట 104 ఉద్యోగులు ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

104 ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి. అంజిబాబు డిమాండ్ చేశారు. 104 ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఆదివారం ధర్నా చేశారు. జిల్లా అధ్యక్షులు వెంకటేశ్ అధ్యక్షతన జరిగిన ధర్నానుద్దేశించి ఎండి.అంజిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం మారినప్పుడల్లా థర్డ్ పార్టీ కాంట్రాక్టర్‌ను మార్చడం సరైనది కాదని అన్నారు. గత ప్రభుత్వం అరవిందో కంపెనీకి 104 వ్యవస్థను నడిపే కాంట్రాక్టును ఇచ్చిందని ప్రస్తుత ప్రభుత్వం అరవిందో కంపెనీ మార్చి వేరే కంపెనీకి ఇవ్వాలని ప్రయత్నిస్తుందన్నారు. ఉద్యోగులు అభద్రతా భావానికి గురి అవుతున్నారని అన్నారు. ప్రభుత్వమే నేరుగా 104 వ్యవస్థను నడపాలన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించి వారికి కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. లేదంటే పిహెచ్‌సిలను అనుసంధానం చేయాలని కోరారు. థర్డ్ పార్టీ విధానాన్ని ఎత్తివేయాలని అన్నారు. 104 ఉద్యోగులకు నెలనెలా వేతనాలు చెల్లించడం లేదని వేతనాలు చెల్లించేటువంటి పద్ధతిలో 104ను నడపాలని డిమాండ్ చేశారు. వీరికి పిఎఫ్ ఇఎస్ఐ చెల్లించడంలో కంపెనీ జాబ్ ఏం చేసిందని దీనివల్ల ఇఎస్ఐ అమలు కావడం లేదని అన్నారు. జీవో నెంబర్ 7 అమలు చేసి వేతనాలు అమలు చేయాలని కోరారు. 104 ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి పెద్దయ్య మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా మన హక్కుల కొరకు ప్రతి ఒక్కరూ పోరాటంలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి చంద్రహాస్ జిల్లా నాయకురాలు కళ్యాణి జిల్లా నాయకులు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

డ్రోన్ హబ్‌కు 300 ఎకరాలు

- కలెక్టర్ పి.రంజిత్ బాష

- కలెక్టర్ తో డ్రోన్ కార్పొరేషన్ సిఎండి భేటీ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఓర్వకల్లు పారిశ్రామిక వాడలో 300 ఎకరాల్లో డ్రోన్ హబ్ ఏర్పాటుకు భూములను కేటాయించేందుకు సన్నద్ధమైనట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. ఎపి డ్రోన్ కార్పొరేషన్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కె. దినేష్ కుమార్, జిల్లా కలెక్టర్ తో ఆదివారం నాడు మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఓర్వకల్లు ప్రాంతంలో 300 ఎకరాల్లో డ్రోన్ హబ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటోందన్నారు. ఇందుకు అవసరమైన భూముల ఎంపికపై డ్రోన్ కార్పొరేషన్ సిఎండితో చర్చించామన్నారు. ఓర్వకల్లు మండలం పాలకొలను, కొమరోలు వద్ద డ్రోన్ హబ్ ఏర్పాటుకు అనువైన స్థలాలుగా సూచించామని కలెక్టర్ తెలిపారు. ఓర్వకల్లును డ్రోన్ హబ్‌గా ఏర్పాటును ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటోందన్నారు..డ్రోన్ హబ్ ఏర్పాటు వల్ల జిల్లాలో ఎంతో మందికి ఉపాధి, ఉద్యోగావకాశాలు లభిస్తాయని కలెక్టర్ తెలిపారు. హబ్ ఏర్పాటుకు కావాల్సిన భూసేకరణకు తగిన చర్యలు తీసుకుంటున్నామని, ఈ అంశంపై రెవెన్యూ అధికారులకు ఆదేశాలు ఇచ్చామని కలెక్టర్ వివరించారు.

డ్రోన్ కార్పొరేషన్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాష

ఈసారైనా ఇస్తారా..?

- జిల్లా ప్రాజెక్టులకు దక్కని నిధులు - ముందుకు కదలని పథకాలు
- ఈ బడ్జెట్‌పై జిల్లా వాసుల ఆశలు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కర్నూలు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు ముందుకు కదలడం లేదు. గత కొన్నేళ్లుగా రాష్ట్ర బడ్జెట్‌లో జిల్లాలోని ప్రాజెక్టులకు నిధులు ఇవ్వకపోవడంతో ఏ ప్రాజెక్టూ ముందుకు సాగడం లేదు. చాలా ప్రాజెక్టులు శంకుస్థాపనకే పరిమితమయ్యాయి. సోమవారం అసెంబ్లీలో పూర్తి స్థాయి రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో ఈ సారైనా జిల్లా ప్రాజెక్టులకు నిధులు ఇస్తారా..? లేదా..? అని జిల్లా వాసులు ఎదురుచూస్తున్నారు....

గతేడాది రాష్ట్ర బడ్జెట్‌లో జిల్లాలో పరిశ్రమల ఏర్పాటు గురించి ఎక్కడా ప్రస్తావించలేదు. రాయలసీమకు ఆధారంగా ఉన్న కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల అభివృద్ధికి ఎటువంటి కేటాయింపులూ చేయలేదు. జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల అంచనాలను పక్కనబెట్టి మొక్కుబడిగా నిధులు కేటాయించారు.

గతి లేని గుండ్రేవుల

కర్నూలు, కడప జిల్లాలకు మేలు కలిగిలే రూపొందించిన గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన చర్యలేవీ ఇప్పటి వరకూ మొదలు కాలేదు. కర్నూలు జిల్లా సుంకేసుల దగ్గర తుంగభద్ర నదిపై 1.20 టిఎంసిల సామర్థ్యంతో 1865లో అప్పటి పాలకులు సుంకేసుల జలాశయాన్ని నిర్మించారు. ఈ బ్యారేజీకి అనుసంధానంగా కర్నూలు-కడప (కెసి) కాలువ నిర్మించారు. జల రవాణా కోసం నిర్మించిన కాలువను స్వాతంత్ర్యం అనంతరం సాగునీటి కాలువగా మార్చారు. కృష్ణా వాటర్ డిస్‌ప్యూట్ ట్రిబ్యునల్ 31.90 టిఎంసిల నీటి వాటాను కేటాయించింది. దీని పరిధిలో కర్నూలు, కడప జిల్లాలో 2.65 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. సుంకేసుల సామర్థ్యం తక్కువ కావడంతో తుంగభద్రకు వరద వస్తేనే కాలువకు సాగునీరు అందుతోంది. ఈ సమస్యను అధిగమించేందుకు సాగునీటి నిపుణులు, విశ్రాంత ఇంజినీర్ సుబ్బరాయుడు సుంకేసుల రిజర్వాయర్ ఎగువన గుండ్రేవుల జలాశయం నిర్మాణానికి రూపకల్పన చేశారు. కర్నూలు జిల్లాలోని సి.బెళగల్, నందవరం, తెలంగాణలోని రాజోలు ప్రాంతాల్లో ఈ ప్రాజెక్టును నిర్మించేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. గుండ్రేవుల జలాశయం నిర్మాణం జరిగితే 20 టిఎంసిలు నిల్వ చేయనున్నారు. వరద లేని సమయంలోనూ ఈ నీటిని వాడుకోవచ్చు. గుండ్రేవులకు సంబంధించి గత ప్రభుత్వం లాగే ఈ ప్రభుత్వం కూడా శ్రద్ధ పెట్టడం లేదు. వైసిపి ప్రభుత్వం వచ్చాక ప్రవేశపెట్టిన నాలుగు బడ్జెట్లలోనూ గుండ్రేవులకు నిధులు కేటాయించకపోవడంతో జిల్లా ప్రజల ఆశలు అడియాశలయ్యాయి.

ఉత్తిపోతలుగానే వేదవతి ఎత్తిపోతలు

కరువుకు నిలయమైన ఆలూరు ప్రాంతంలో పొలాలు పచ్చబడాలన్న ఉద్దేశంతో వేదవతి నది పరిధిలో నిర్మించిన ఎత్తిపోతలు ఉత్తిపోతలుగా మారాయి. వేదవతి నది పరిధిలో అమృతాపురం, జె.హోసళ్లి, సిద్ధాపురం వద్ద మూడు ఎత్తిపోతల పథకాలు నిర్మించారు. 2008లో మంత్రి మారెప్ప హయాంలో వీటిని చేపట్టారు. నిర్వహణలో లోపాలు అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో పథకాలు ఏడాదికే నిరుపయోగంగా మారాయి. పథకం ప్రారంభంలో వేసిన గొట్టాలు దెబ్బతిన్నాయి. ఒక్కో ఎత్తిపోతల కింద 500 నుంచి 600 ఎకరాల ఆయకట్టు ఉంది. మరమ్మతులకు నిధులు వెచ్చించి పునరుద్ధరిస్తే తామే వాటిని కొనసాగించుకుంటామని రైతులు వేడుకుంటున్నా పట్టించుకొనేవారు కరువయ్యారు.

వలస నివారణ చర్యలు శూన్యం

ఏళ్లు గడుస్తున్నా జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో వలస వెతలు తప్పడం లేదు. ఉన్న ఊళ్లో ఉపాధి లేకపోవడంతో పొట్ట చేత పట్టుకుని ఇతర పట్టణాలకు, నగరాలకు తరలిపోతున్నారు. కోసిగి, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, హోళగుంద, ఆలూరు, కోడుమూరు మండలాల నుంచి ఈ ఏడాది కూడా వలసలు ప్రారంభమయ్యాయి. తెలంగాణ, బెంగళూరు, గుంటూరు, ముంబయికి తరలివెళ్లారు. ఈ ఏడాది జిల్లావ్యాప్తంగా 40వేల మందికి పైగా వలస వెళ్లారు. వలస నివారణకు చర్యలు చేపట్టే అంశాన్ని ఇప్పటి వరకూ ఏ బడ్జెట్‌లో ప్రస్తావించలేదు.



సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలి

పజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాష్ట్రంలోని ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను తక్షణమే అమలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామంలో ఆదివారం సిపిఎం ప్రజాపోరు నిర్వహించారు. స్థానిక నాయకులు ఎస్.మధుసూదన్ అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి బి.నాగన్న, సిఐటియు మండల కార్యదర్శి షాజహాన్ పాల్గొన్నారు. జి.రామకృష్ణ మాట్లాడుతూ అధిక ధరలు, విద్యుత్‌ఛార్జీల పెరుగుదల అదుపుచేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో మీనమేషాలు లెక్కిస్తుందన్నారు. ఈనెల 14న కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాకు పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావాలని కోరారు.

కర్నూలు కార్పొరేషన్: కర్నూల్ నగరంలోని 23వ వార్డు శ్రీరామ్ నగర్ లో సిపిఎం వార్డు కమిటీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజాపోరు కార్యక్రమం నిర్వహించారు. కెవి.జనార్దన్ రావు నాయకత్వంలో కరపత్రాలు పంపిణీ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్.రాధాకృష్ణ, నగర కార్యదర్శి వర్గ సభ్యులుఆర్.నరసింహులు మాట్లాడుతూ ఈనెల 14న కలెక్టరేట్ ముట్టడికి భారీగా తరలిరావాలని ప్రజలను కోరారు. సిపిఎం నగర నాయకులు సి. శేషాద్రి, సి.ఎల్లయ్య, సోషల్ మీడియాజిల్లానాయకులు ఎల్లగౌడు, మునిస్వామి, సిపిఎం వార్డు నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈనెల 14వ కర్నూలు కలెక్టరేట్ ముందు నిర్వహించే ధర్నాలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సి. గురు శేఖర్ కోరారు. కర్నూలు పాతనగరంలో 7,8 వార్డులలో కరపత్రాలు పంచుతూ విస్తృత ప్రచారం చేశారు. నగర కార్యదర్శి వర్గ సభ్యులు అబ్దుల్ దేశాయ్, తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు 15వ వార్డు బుధవార్ పేటలో సిపిఎం ప్రజా పోరుయాత్ర నిర్వహించారు. ఎస్. సామెల్ అధ్యక్షత వహించారు. సిపిఎం నగర సెక్రటేరియట్ సభ్యులు కె . రామకృష్ణ , సివిల్ సప్లయ్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.కృష్ణ, మహిళా సంఘం నగర కార్యదర్శి పి.పద్మావతి కాటి కాపరి సంఘం జిల్లా కార్యదర్శి ఎన్. కృష్ణ మాట్లాడారు. విద్యుత్ చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలని సిపిఎం సీనియర్ నాయకులు డి. పార్వతయ్య డిమాండ్ చేశారు.కర్నూలు నగరంలోని రెండవ వార్డు ఖల్ల వీధిలో ప్రజా పోరు కార్యక్రమం చాంద్ భాషా అధ్యక్షతన నిర్వహించారు. డి. పార్వతయ్య ,ఎస్‌డి. ఖాజా పాషా మాట్లాడి ప్రజాపోరు ప్రధాన్యతను వించారు.

కర్నూలు క్రైమ్: కర్నూలు మండల సిపిఎం కార్యదర్శి పి హుసేనయ్య కోరారు. కర్నూలు మండలం గొందిపర్ల గ్రామంలో ప్రజాపోరు కార్యక్రమాన్ని మండల నాయకులు రాఘవేంద్ర, సీనియర్ నాయకులు ఆంజనేయులుతో కలిసి నిర్వహించారు.

ప్రజాపోరు కార్యక్రమంలో మాట్లాడుతున్న జి.రామకృష్ణ

శ్రీరామ్‌నగర్‌ప్రజాపోరులో పాల్గొన్న పిఎస్.రాధాకృష్ణ

యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు విజయవంతం

-గూడూరులో ఉత్సాహంగా సాగిన మహాసభలు

-పలు తీర్మానాలకు ఆమోదం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) జిల్లా స్వర్ణోత్సవ మహాసభలు గూడూరు పట్టణంలో రెండు రోజులపాటు నిర్వహించారు. శని ఆదివారాల్లో జరిగిన ఈ మహాసభలు ఎంతో ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. మొదటి రోజు మహాసభల ప్రారంభం భారీ ఎత్తున ప్రదర్శన , బహిరంగ సభను నిర్వహించారు. రెండో రోజు జిల్లా వ్యాప్తంగా ఆయా మండలాల నుండి విచ్చేసిన ఉపాధ్యాయ ప్రతినిధులు పలు అంశాలపై చర్చించి తీర్మానాలను చేశారు. యుటిఎఫ్ ఏర్పడి 50 సంవత్సరాలు పూర్తి అయిన నేపథ్యంలో మునిపెన్నడూ లేనివిధంగా గూడూరు కేంద్రంలో మహాసభలను నిర్వహించడం పట్ల పెద్ద ఎత్తున చర్చనీయాంశమైంది. వెనుకబడిన ప్రాంతంగా ఉన్నటువంటి ఈ ప్రాంతంలో విద్యారంగ పటిష్టతకు దోహదపడేలా ఈ మహాసభలు కొనసాగాయి. పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించి వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లేందుకు వ్యూహరచన చేశారు. ప్రభుత్వ పాఠశాల విద్యా పరిరక్షణకు ఉద్యమ బాట పట్టాల్సి ఉంటుందని ఈ మహాసభల నుండి ఉపాధ్యాయ లోకానికి పిలుపునిచ్చారు.

జిల్లా మహాసభల్లో తీర్మానించిన ముఖ్యంశాలు

డిఎస్‌సి 2008 ఎంటిఎస్ ఉపాధ్యాయులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలి. ప్రభుత్వ పాఠశాలలకు ఉచితంగా రాష్ట్ర ప్రభుత్వమే విద్యుత్ సరఫరా చేయాలి. కాంట్రాక్టు ఉద్యోగులందరని వెంటనే రెగ్యులరైజ్ చేయాలి. మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు దృష్టి సారించాలి. ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ సమర్థవంతంగా అమలు చేసేందుకు పూనుకోవాలి. ఒకే విద్యా విధానాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం దృష్టి సారించాలి. జిఒ నెంబర్ 117 లో రద్దుచేసి ప్రభుత్వ పాఠశాల విద్యను మరింత బలోపేతం చేయాలి. ప్రాథమిక స్థాయిలో మాతృభాషలో విద్యాబోధన ఉంచడమే కాకుండా సెకండరీ స్థాయిలో సమాంతరం మీడియంలను కొనసాగించాలి. 12వ పిఆర్‌సిని వెంటనే అమలు చేసి గత పిఆర్సి బకాయిలను కూడా చెల్లించాలి. ఉద్యోగ ఉపాధ్యాయులందరికీ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన విద్యా విధానంలోని అనేక అంశాలను సవరించాలి.

తొలిరోజు సభలో మాట్లాడుతున్న కె.సురేష్‌కుమార్

కాంగ్రెస్ నియోజకవర్గ సమన్వయకర్తల నియామకం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలోని ఆరు నియోజక వర్గాలకు సమన్వయ కర్తలను నియమించిన పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల ఆదివారం ప్రకటించారు. కోడు మూరుకు మాజీ ఎమ్మెల్యే, కర్నూలు డిసిసి అధ్యక్షులు పరిగెల మురళీకృష్ణ, కర్నూలుకు సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ జిలాని బాష, ఎమ్మిగనూరుకు ఎం ఖాశీం వలి, ఆదోనికి జి.రమేష్ యాదవ్, మంత్రాలయం పిఎస్.మురళీకృష్ణరాజు, ఆలూరు చిప్పగిరి లక్ష్మీనారాయణలు సమన్వయకర్తలు గా నియమితులయ్యారు. పత్తికొండ నియోజకవర్గం కు మాత్రం ప్రకటించలేదు. నియోజకవర్గ సమన్వయకర్తలు పార్టీ అభివృద్ధికి పనిచేయాలని వైఎస్ షర్మిల కోరారు.



స్థానిక సమస్యలుంటే అర్జీ ఇవ్వండి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : నగరంలో ఎక్కడైనా కాలనీల్లో ఏవైనా స్థానిక సమస్యలుంటే అర్జీ ఇవ్వాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. సోమవారం ఉదయం 10 నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు నగరపాలక కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎబిసికి సాగునీరు విడుదల

ప్రజాశక్తి - చిప్పగిరి

ఆలూరు బ్రాంచ్ కెనాల్ (ఎబిసి)కు సాగునీరు విడుదల చేశారు. నీటిని నిలిపి వేయడంతో రైతుల ఇబ్బందులు చూసి స్పందించిన వైసిపి మండల కన్వీనర్ జూటూరు మారయ్య ఆదివారం ఆలూరు ఆయకట్టు రైతులతో కలిసి హంద్రీనీవా తూము వద్ద అడ్డంగా ఉన్న రాయిని జెసిబితో తీయించి సాగు తాగునీటిని విడుదల చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తామని తెలిపారు. ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి ఆధ్వర్యంలో రైతు సంక్షేమానికి, అభివృద్ధికి కట్టుబడి ఉంటామన్నారు. త్వరలో జరగబోయే సాగునీటి ఎన్నికల్లో రైతులు వైసిపి అభ్యర్థికి మద్దతు తెలిపి గెలిపిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. రైతులు అధైర్య పడవద్దని, రైతుల కోసం దేనికైనా సిద్ధమని తెలిపారు. దేగులపాడు సర్పంచి నీలకంఠ, అభిమాని సేనాపతి, లింగన్న, చిప్పగిరి, బెల్డోన, నగరడోన, మల్లికార్జునపల్లి గ్రామాల రైతులు పాల్గొన్నారు.

నీటిని విడుదల చేస్తున్న నాయకులు, అధికారులు

ప్రజలను చైతన్య పరుస్తాం

- కాంగ్రెస్ ఇన్‌ఛార్జీ రమేష్ యాదవ్

ప్రజాశక్తి - ఆదోని

ఎన్‌డిఎ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, లోపాలను వివరించి చైతన్య పరుస్తామని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ రమేష్ యాదవ్ తెలిపారు. ఆదివారం కాంగ్రెస్ నియోజకవర్గాల ఇన్‌ఛార్జీల జాబితాను పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల విడుదల చేశారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జీగా మరోసారి రమేష్ యాదవ్‌కు అవకాశం దక్కింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2024 ఎన్నికల్లో ఇండియా కూటమి ద్వారా నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలిచామన్నారు. ఎన్‌డిఎ, వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థులకు గట్టి పోటీ ఇచ్చామని తెలిపారు. ఎమ్మెల్యే పార్థసారథి అభివృద్ధిని గాలికొదిలేశారని విమర్శించారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు ప్రశ్నిస్తూ నిలదీస్తున్నామన్నారు. తనపై నమ్మకం ఉంచి మరోసారి ఇన్‌ఛార్జీ బాధ్యతలు అప్పజెప్పిన పిసిసి అధ్యక్షులు షర్మిలకు కృతజ్ఞతలు తెలిపారు. క్షేత్రస్థాయిలో నాయకుల సహకారంతో కాంగ్రెస్‌ను బలోపేతం చేసే దిశగా కృషి చేస్తామని చెప్పారు. రెండోసారి ఇన్‌ఛార్జీగా ఎంపికైన రమేష్ యాదవ్‌కు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

కాంగ్రెస్ ఇన్‌ఛార్జీగా లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి - ఆలూరు

కాంగ్రెస్ పార్టీ ఆలూరు ఇన్‌ఛార్జీగా చిప్పగిరి లక్ష్మీనారాయణను నియమిస్తూ ఆదివారం పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా చిప్పగిరి లక్ష్మీనారాయణ మాట్లాడారు. 30 ఏళ్లుగా కాంగ్రెస్‌లో ఉంటున్నానని, పార్టీ కష్టకాలంలో ఉన్నా పార్టీ కోసం సేవలందిస్తున్నానని తెలిపారు. తనకు ఇన్‌ఛార్జీ బాధ్యతలు ఇచ్చిన పిసిసి అధ్యక్షులు షర్మిల, జిల్లా అధ్యక్షులు మురళీకృష్ణకు ధన్యవాదాలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడతామని చెప్పారు. ప్రధాన ప్రతిపక్ష పాత్ర పోషిస్తామని, కాంగ్రెస్‌ను బలోపేతం చేసి గెలుపు దిశగా ముందుకు తీసుకెళ్తామని తెలిపారు.

నేను వాల్మీకి బిడ్డనే...

- కప్పట్రాళ్ల బొజ్జమ్మ

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని కప్పట్రాళ్ల గ్రామానికి చెందిన కీర్తిశేషులు వెంకటప్ప నాయుడు వారసురాలిగా తాను వాల్మీకి బిడ్డనే అని కప్పట్రాళ్ల బొజ్జమ్మ తెలిపారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వడంతో కొందరు తనను వాల్మీకి కాదని సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేస్తున్నట్లు వివరించారు. ఆదివారం ఆమె స్వగ్రామం జిల్లేడుబుడకల గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. వాల్మీకుల్లో అనేక తెగలు ఉన్నాయని, అందులో భాగంగానే కొందరిని ఆయా ప్రాంతాల్లో వారి పద్ధతుల్లో పిలుచుకుంటారని తెలిపారు. ఏ విధంగా పిలిచినా వాల్మీకులే కదా అని ప్రశ్నించారు. వాల్మీకులు కొందరు రాజకీయ క్రీడకు తలొగ్గకుండా వాల్మీకుల ఐక్యతను కాపాడాలని కోరారు. ఎవరెన్ని ఆరోపణలు చేసినా నమ్మ వద్దన్నారు.

నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణానికి చెందిన శ్రీసాయిఉదయ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని రోడ్డుపై ఉన్న నిరాశ్రయులకు, వృద్ధులకు, పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. యూత్ సభ్యులు నవీన్ కుమార్, రమేష్, లక్ష్మీకాంత్, శ్యామ్, తరుణ్, మోహన్, ఈరన్న, వెంకటేష్ పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ చేస్తున్న సభ్యులు

రేషన్ డీలర్ చేతివాటం

- ఐదు నెలలుగా సరుకులు పంపిణీ చేయని డీలర్

- ఫిర్యాదు చేసినా పట్టించుకోని రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి - హోళగుంద

రేషన్ డీలర్ చేతివాటం ప్రదర్శిస్తున్నాడు. ప్రభుత్వం నెలనెలా రేషన్ షాపులో ఇచ్చే సరుకుల కోసం ఎదురుచూసే నిరుపేదలు వారు. అలాంటి పేదలకు ఆ డీలర్ సరుకుల పంపిణీలో అవకతవకలకు పాల్పడుతూ చేతివాటం ప్రదర్శించాడు. బియ్యం, బ్యాళ్లు, చక్కెర ఇవ్వకుండా కార్డుదారుల కడుపు కొడుతున్నాడు. హోళగుందలోని బుడగజంగం కాలనీ ప్రజలకు రేషన్ సరుకులు పంపిణీ చేయకుండా దబాయిస్తున్నాడు.

హోళగుందలోని చౌక దుకాణం-3కు సంబంధించి 496 మంది కార్డుదారులున్నారు. అందులో బుడగజంగాల కాలనీ వాసులు 200 మందికి పైగా ఉన్నారు. ఎండియు వాహనం ద్వారా వీరికి నెలనెలా ప్రభుత్వం నుంచి బియ్యం, బ్యాళ్లు, చక్కెర సరఫరా చేయాల్సి ఉంది. డీలర్ కొందరికి మాత్రమే బియ్యం పంపిణీ చేసి బుడగజంగాల కాలనీ వాసులకు ఐదు నెలలైనా రేషన్ సరుకులు పంపిణీ చేయడం లేదని వాపోతున్నారు. బియ్యం కావాలంటే రేషన్ షాపుకను రావాలని, లేకుంటే 'ఎవరికి చెప్పుకుంటారో... చెప్పుకోండి' అని దబాయిస్తున్నట్లు కార్డుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రికార్డు (అలాట్మెంట్)లో మాత్రం బియ్యం, చక్కెర, బ్యాళ్లు కార్డుదారులకు ఇచ్చినట్లు నమోదు చేసి కార్డుదారుల కడుపుకొడుతున్నాడని కార్డుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. బుడగ జంగాల కాలనీ వాసులకు ఎండియు వాహనం ద్వారా రేషన్ సరుకులు పంపిణీ చేయాలనీ కోరుతున్నారు. ఈ విషయంపై డిప్యూటీ తహశీల్దార్ నిజాముద్దీన్‌ను వివరణ కోరగా... ఇప్పటికే డీలర్‌ను హెచ్చరించామని, మరో రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

బుడగజంగం కాలనీవాసులు

ఆస్తి కోసం హత్య...

- కన్న తండ్రిని చంపిన కొడుకు

ప్రజాశక్తి - చిప్పగిరి

ఆస్తి కోసం కన్న తండ్రిని హత్య చేసిన కుమారుని బాగోతాన్ని చిప్పగిరి పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. వివరాలిలా ఉన్నాయి... చిప్పగిరి గ్రామానికి చెందిన కురువ కారుమంచప్ప (62) సెప్టెంబర్ 13న గుంతకల్లు ఆలూరు రోడ్డు పక్కన కౌలుకు చేసిన పొలంలో చెట్టుకు వేలాడుతూ మృతి చెందారు. కారుమంచప్ప భార్య ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా పోలీసులు నమోదు చేసి దర్యాప్తును కొనసాగించారు. ఎస్పీ, పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య ఆదేశాల మేరకు ఆలూరు సిఐ శ్రీనివాస్ నాయక్ ఆధ్వర్యంలో ఎస్ఐ సతీష్ కుమార్, కర్నూలు టెక్నికల్ టీం సభ్యులు కలిసి విచారణ సాగించి వాస్తవాలను వెలికి తీశారు. ఆదివారం రాత్రి పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య మాట్లాడారు. పొలం భాగాల పంపకాల్లో తేడాలు ఉన్నాయని, ఎక్కువ ధర పలికే భూమి ఇవ్వలేదని పెద్ద కుమారుడు శ్రీనివాసులు తండ్రిపై కక్ష పెంచుకొని గొడవ పడేవాడని తెలిపారు. కారుమంచప్ప రోజు మాదిరిగా గుంతకల్లు నుంచి చిప్పగిరి వస్తాడని తెలుసుకొని, కాపుకాసి హత్య చేసి పొలం పక్కన ఉన్న చెట్టుకు ఉరేసినట్లు శ్రీనివాసులు చిప్పగిరి తహశీల్దార్ కార్యాలయంలో విఆర్‌ఒ వద్ద వెళ్లి వాస్తవాలను తెలియజేసినట్లు చెప్పారు. నిందితుడు శ్రీనివాసులును పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చి విచారణ చేసి రిమాండ్‌కు పంపుతున్నట్లు తెలిపారు. ఆలూరు సిఐ శ్రీనివాస్ నాయక్, చిప్పగిరి ఎస్ఐ సతీష్ కుమార్, కర్నూలు టెక్నికల్ టీం సభ్యులు, పోలీసులు సుబ్రహ్మణ్యం, షబ్బీర్, భాస్కర్, రంగయ్య, రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటరామయ్య

బెల్టుషాపు నిర్వాహకుడు అరెస్టు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని పాత ఊరులో ప్రభుత్వ మద్యాన్ని బెల్టుషాపు ద్వారా విక్రయిస్తున్న మల్లికార్జునను అరెస్టు చేసినట్లు ఎస్ఐ పరమేష్ నాయక్ తెలిపారు. ఆదివారం శ్రీఅభయాంజనేయస్వామి దేవాలయం వద్ద మల్లికార్జున నుంచి ఎపికి చెందిన 41 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఆయన మాట్లాడారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా, అక్రమ మద్యం వ్యాపారం చేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడులు చేసినట్లు తెలిపారు. మద్యం బెల్టుషాపు నిర్వాహకునిపై కేసు నమోదు చేసి, ఎమ్మిగనూరు కోర్టుకు తరలించగా రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

కొనసాగుతున్న ఇసుక అక్రమ రవాణా

- రాఘవేంద్ర సర్కిల్ మీదుగా దర్జాగా దందా

- నిస్సహాయ స్థితిలో ప్రభుత్వ శాఖల అధికారులు

ప్రజాశక్తి - మంత్రాలయం

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక విధానంతో అక్రమార్కులు అక్రమ సంపాదనకు తెర తీసి దర్జాగా దందా సాగిస్తున్నారు. పాలకుల కనుసన్నల్లో విధులు నిర్వహిస్తున్న మైన్స్, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో కుదేలైన నిర్మాణ రంగం పుంజుకునే విధంగా ముఖ్యమంత్రి ఉచిత ఇసుక విధానం ప్రవేశపెట్టారు. నిబంధనలు తుంగలో తొక్కి అనుమతులు లేకుండా తుంగభద్ర నది నుంచి పట్టపగలే పోలీసుల సాక్షిగా ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నా అడిగేవారు లేకుండా పోతున్నారు. గత ప్రభుత్వంలో చేపట్టిన ఇసుక దందాకు మేమేమి తక్కువ అన్నట్లు నేటి టిడిపి ప్రభుత్వంలో కూడా ఇసుకను అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. దూరాన్ని బట్టి ధరను నిర్ణయించి రూ.1500 నుంచి రూ.4 వేల వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. అధికారులు స్పందించి ముఖ్యమంత్రి ఆదేశాలను అమలు చేసి ఇసుక దందా జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ట్రాక్టర్‌లో తరలిస్తున్న ఇసుక

చంద్రబాబుకు అండగా నిలుద్దాం

- టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ

ప్రజాశక్తి - ఆదోని

రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించే దిశగా అహర్నిశలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాష్ట్ర ప్రజలు అండగా నిలవాలని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ తెలిపారు. ఆదివారం పట్టణంలోని కిలిచినపేట, శక్తి గుడి ప్రాంతంలో టిడిపి వార్డు నాయకులు చంద్ర, నరసింహులు ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు టిడిపి సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ అనాలోచిత నిర్ణయాల వల్ల రాష్ట్రం మరో 10 ఏళ్ల అభివృద్ధిలో వెనకకు వెళ్లిందని విమర్శించారు. అలాంటి పరిస్థితిని చక్కదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. టిడిపి నాయకులు రాఘవరెడ్డి, శ్రీనివాసులు, నరసప్ప, విజయ్, చిట్టి, సంతోష్, ఈరన్న, ఉదయ్, దుర్గాప్రసాద్, వేణు, వంశీ, అయ్యప్ప, అర్జున్, యల్లప్ప, కుమార్, రాఘవేంద్ర ఉన్నారు.

టిడిపి సభ్యత్వం ఇస్తున్న గుడిసె ఆది కృష్ణమ్మ

సీజ్ చేసి స్టేషన్ ముందు ఉంచిన వాహనాలు

సబ్సిడీ టోరా బియ్యం పట్టివేత

- ఒక బొలేరో, ఒక టాటా ఏస్ వాహనం సీజ్

- ఐదుగురిపై కేసు నమోదు

ప్రజాశక్తి - ఆస్పరి

అక్రమంగా రెండు వాహనాల్లో తరలిస్తున్న సబ్సిడీ టోరా బియ్యాన్ని జొహరాపురం గ్రామంలో విజిలెన్స్ అధికారులు రామకృష్ణ, విశ్వనాథ్ ఆదివారం పట్టుకున్నారు. సిఐ మస్తాన్ వలీ వివరాల మేరకు... ఆదోని బోయ గేరికి చెందిన రాములు, పత్తికొండకు చెందిన రాఘవరెడ్డి ఆధ్వర్యంలో ప్రజల దగ్గరకు వెళ్లి కిలో రూ.15 చొప్పున బియ్యం కొనుగోలు చేసి ఒక బొలేరో, ఒక టాటా ఏస్ వాహనంలో తీసుకొని జొహరాపురం గ్రామంలోని గోడైన్‌లో స్టాక్ ఉంచారు. అక్కడి నుంచి లోడ్ చేసి తరలిస్తుండగా 132 బ్యాగులు, 64 క్వింటాళ్ల 5 కిలోల బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. ఆదోనికి చెందిన రాములు, పత్తికొండకు చెందిన రాఘవరెడ్డి, ఆదోని మహాత్మ గాంధీ నగర్‌కు చెందిన ఆకాష్, నలకదొడ్డి గ్రామానికి చెందిన బాబు, జొహరాపురం గ్రామానికి చెందిన కాశీపతిపై నమోదు చేసి రెండు వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. ఇన్‌ఛార్జీ ఆర్ఐ రంగస్వామి, విఆర్‌ఒ హరినాయక్ ఉన్నారు.

శ్రీమఠంలో కర్ణాటక మంత్రి

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన శ్రీరాఘవేంద్ర స్వామిని కర్ణాటక రాష్ట్ర చిన్న పరిశ్రమల శాఖ మంత్రి శరణబసప్ప దర్శించుకున్నారు. ఆదివారం సాయంత్రం కర్ణాటక రాష్ట్రం యాదగిరి జిల్లా షాపూర్‌కు చెందిన మంత్రి కుటుంబ సమేతంగా మంత్రాలయం వచ్చారు. దర్శనార్థం ఆలయం చేరుకున్న వారికి శ్రీమఠం సహాయక పిఆర్‌ఒ హొన్నాళి వ్యాసరాజాచార్ స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రుని మూల బృందావనాన్ని దర్శించుకొన్నారు. శ్రీమఠం పిఆర్‌ఒ ఐపి.నరసింహ మూర్తి, ధార్మిక అధికారి శ్రీపతి ఆచార్, శ్రీమఠం క్యాషియర్ దేశాయ్, ఎస్ఐ పరమేష్ నాయక్, కానిస్టేబుల్ రంగస్వామి, కర్ణాటక రాష్ట్రం ఇడుపునూర్ హెడ్ కానిస్టేబుల్ శంకర్ గౌడ ఉన్నారు.

రైతు కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఆస్పరి

బండమీద వెంకటేశ్వర్లు సేవా సమితి ఆధ్వర్యంలో రైతు కుటుంబానికి ఆర్థిక సహాయం అందించినట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడారు. మండలంలోని కైరుప్పల గ్రామానికి పక్కీరప్ప ఇంట్లో గ్యాస్ సిలిండర్ లీకై అగ్ని ప్రమాదం జరిగిందని తెలిపారు. ఈ ప్రమాదంలో 30 క్వింటాళ్ల పత్తి, 2 క్వింటాళ్ల మిరప, నిత్యావసర సరుకులు, రూ.30 వేల నగదు కాలిపోయాయని చెప్పారు. కుటుంబాన్ని పరామర్శించి క్వింటా బియ్యం, రూ.5 వేల నగదు అందించినట్లు తెలిపారు. సిపిఐ మండల కార్యదర్శి విరుపాక్షి, నాయకులు సుంకన్న, శ్రీనివాసులు, వీరేష్, గోపాల్, రైతుసంఘం మండల కార్యదర్శి రంగన్న, నాగరాజు, రమేష్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న గిడ్డయ్య

ఎన్నికల హామీలను నెరవేర్చాలి: సిపిఎం

ప్రజాశక్తి - ఆస్పరి

కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు వచ్చిన హామీలను అమలు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు హనుమంతు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో 'ప్రజా పోరు' గోడపత్రిలను విడుదల చేశారు. అనంతరం కరపత్రాలను పంచుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈనెల 14న మండల ప్రజా పరిషత్ కార్యాలయం ముందు చేపట్టే ధర్నాలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మండల నాయకులు బాలకృష్ణ, రామాంజనేయులు, చిన్న వీరన్న, ఈరన్న పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** పట్టణంలోని బైపాస్ రోడ్డు, తాయమ్మ కాలనీ, ముబారక్ నగర్ ప్రజా సమస్యలపై ప్రజా పోరు యాత్ర నిర్వహించారు. సిపిఎం పట్టణ కార్యదర్శి పి.గోవిందు, పట్టణ కమిటీ సభ్యులు బి.రాముడు, యు.లక్ష్మీ నరసయ్య, కార్యకర్తలు నామాల రాముడు, పరమేష్, మాదన్న, దాదా హుస్సేన్, బడేసాబ్, సుభాన్ పాల్గొన్నారు. **ఆదోని (రూరల్)** మండలం పెద్దహరివాణం, సంతెకుడ్లూరు, బలాదూర్ గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. సిపిఎం మండల కార్యదర్శి కె.లింగన్న, ఈనెల 14న ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే ధర్నాలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సిపిఎం మండల నాయకులు లక్ష్మన్న, శాఖ కార్యదర్శులు ఎం.అయ్యన్న, సిపిఎం సీనియర్ నాయకులు రామలింగప్ప, రామప్ప, ముకప్ప, ఏలియా, పార్టీ సభ్యులు అబ్బాస్, గర్జప్ప పాల్గొన్నారు. **కౌతాళం**లోని సిపిఎం కార్యాలయంలో ప్రజా పోరు గోడపత్రికలను విడుదల చేశారు. సిపిఎం సీనియర్ నాయకులు మల్లయ్య, సిపిఎం మండల కార్యదర్శి ఈరన్న, నాయకులు వీరేష్, ఉలిగయ్య పాల్గొన్నారు.

ఆస్పరిలో కరపత్రాలు పంచుతున్న నాయకులు

ఎమ్మిగనూరులో కరపత్రాలు పంచుతున్న నాయకులు

కౌతాళంలో గోడపత్రికలు విడుదల చేస్తున్న నాయకులు

గ్రామాభివృద్ధికి కృషి

- వైసిపి నాయకులు గురునాథ్ రెడ్డి

ప్రజాశక్తి - కౌతాళం

ప్రజల కోసమే బాపురం పంచాయతీని అభివృద్ధి చేస్తానని వైసిపి నాయకులు గురునాథ్ రెడ్డి, సర్పంచి శిల్పారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం 15వ ఆర్థిక సంఘం నిధులతో ఎస్సీ కాలనీలో గ్రావెల్ రోడ్డును వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాల నాగిరెడ్డి రెడ్డి సహకారంతో ప్రజా సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజాసేవకే అంకితమవుతామని పేర్కొన్నారు. అయ్యప్ప రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, దేవ్ రెడ్డి, రాఘవరెడ్డి, జైపాల్ పాల్గొన్నారు.

భారత రాజ్యాంగ దినోత్సవం

ప్రజాశక్తి - నందవరం

మండలంలోని కనకవీడు గ్రామంలో పూలే, అంబేద్కర్ ఐడియాలజీ కన్వీనర్ ఎసి.దేవదానం అధ్యక్షతన భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా బహుజన వక్త పి.రంగస్వామి, అడ్వకేట్ ఎద్దుల చెన్నయ్య, జాబ్ రాయలసీమ అధ్యక్షులు ఎం.నరసప్ప హాజరయి మాట్లాడారు. భారత రాజ్యాంగాన్ని దేశంలోని ప్రతి పౌరుడూ కాపాడుకోవాలని కోరారు. బహుజన విద్యార్థులు జె.సంపత్, జె.శేషన్న, జె.రాజు, ఎ.దినకర్, జి.దానం, జి.యువరాజు, టి.పేతురు పాల్గొన్నారు.

దేవరగట్టులో కార్తీక మాస పూజలు

ప్రజాశక్తి - హోళగుంద

దేవరగట్టు మాలమల్లేశ్వర స్వామి దేవాలయంలో కార్తీకమాసం రెండో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు పూజారులు మహేష్ స్వామి, మల్లయ్య స్వామి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తెల్లవారుజాము నుంచి స్వామి, అమ్మవారికి మహా మంగళహారతి, ఆకుపూజ, రుద్రాభిషేకం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి కాక ఆంధ్ర, కర్ణాటక నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చినట్లు చెప్పారు. భక్తులకు అన్నదానం నిర్వహించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

ఆపద్బాంధవుడు..!

- అందరికీ సేవ చేస్తూ ముందుకు

- ఆదర్శంగా నిలుస్తున్న అడివప్ప గౌడ్

ప్రజాశక్తి - కౌతాళం

సేవ కార్యక్రమాలు చేయడానికి హద్దులే లేవని నిరూపిస్తున్నారు ఆయన. రైతు కుటుంబంలో పుట్టి రైతుల సమస్యలు తెలుసుకొని, అన్ని వర్గాల ప్రజలకు సేవ చేస్తూ.. ఏ కష్టం వచ్చినా 'నేనున్నాను' అంటూ ధైర్యం చెబుతూ అండగా ఉంటున్నారు. రాజకీయంలో అడుగులు పెట్టి గ్రామాన్ని మరింత అభివృద్ధి వైపు తీసుకెళ్లి నాయకుడంటే ఇలా ఉండాలని ఆదర్శంగా నిలుస్తూ గ్రామంలో తనదైన శైలిలో ప్రజా సేవ చేస్తూ ఆ గ్రామానికి అపద్బాంధవుడుగా ఉంటున్నారు. రాజకీయ రంగంలో అంచెలంచెలుగా ఎదుగుతున్నారు. మండలంలోని వల్లూరుకు చెందిన అడివప్ప గౌడ్ ఆదర్శంగా నిలుస్తున్నారు..

మండలంలోని వల్లూరు గ్రామంలో టిడిపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి అడివప్ప గౌడ్ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు పరుగులు తీశాయి. కోటి యాభై లక్షల రూపాయలతో గ్రామంలో పలు వీధులలో సిసి రోడ్లు వేశారు. లక్షల రూపాయలతో తాగునీటి సౌకర్యం గ్రామంలో కల్పించారు. గ్రామ రైతులకు సాగునీరు అందిస్తున్న చెరువుకు నాలుగున్నర కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టారు. హాల్వి వల్లూరు రోడ్డు కోసం సొంత పార్టీ నాయకులనే ఎదిరించారు. సంక్షేమ పథకాలు అర్హులైన అందరికీ అందేలా కృషి చేస్తున్నారు.

ఆర్థిక సహాయం : గ్రామంలో పేద ప్రజల కుటుంబంలో ఎవరైనా చనిపోతే మట్టి ఖర్చుల కోసం తన సొంత డబ్బులతో రూ.ఐదు వేల రూపాయలను ఆర్థిక సాయం అందజేస్తున్నారు. మట్టి ఖర్చులకోసం ఎలాంటి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ఈ ఆర్థిక సాయం చేస్తున్నట్లు ఆయన చెబుతున్నారు. గ్రామ ప్రజలకు ఆరోగ్య సమస్య వచ్చినప్పుడు కూడా ఆర్థికంగా ఆదుకోవడమే కాకుండా యోగక్షేమాలు తెలుసుకొంటున్నారని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

రైతుల కోసం పోరాటం : రైతుల కోసం, వారి సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తానని అడివప్ప గౌడ్ అంటున్నారు. రైతులకు పంటలు పండించడానికి, ధాన్యము ఇంటికి తీసుకురావడం విషయాల్లో(ట్రాక్టరు, వరి కోత యంత్రం) చేదోడు వాదోడుగా రైతులకు సహాయ సహకారాలు అందించడం జరుగుతుందని గ్రామ ప్రజలు తెలిపారు.

రాజకీయంలో అంచలంచెలుగా ఎదుగుతూ

టిడిపిలో 1995లో సామాన్య కార్యకర్తగా చేరారు. అప్పటి నుండి రాజకీయంగా గ్రామంలో మంచిపట్టు సాధించడంతో పాటు పార్టీకి విధేయుడిగా ఉంటున్నారు. సర్పంచిగా తన అనుచరులకు నిలబెట్టి గెలిపించుకున్నారు. ప్రస్తుతం తన అన్న కుమారుడు పంపపతి గౌడ్ సర్పంచ్‌గా గెలుపొంది సేవలు అందిస్తున్నారు. కష్టపడి పనిచేస్తున్న, పార్టీ అభివృద్ధికి, ఆయన అందిస్తున్న సేవలను గుర్తించి అడివప్ప గౌడ్‌కు కౌతాళం సహకార సంఘం అధ్యక్షులుగా అవకాశం కల్పించారు. అలాగే టిడిపి మండల అధ్యక్షులు సీనియర్ నాయకులు ఉలిగయ్య, ప్రస్తుతం జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి సహకారంతో రాష్ట్రస్థాయిలో రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పదవి వరించింది.

కౌతాళం మండలం వల్లూరు గ్రామం

మాట్లాడుతున్న ఉలిగయ్య

యువత స్వయంకృషితో రాణించాలి

- టిడిపి సీనియర్ నాయకులు ఉలిగయ్య

ప్రజాశక్తి - కౌతాళం

వ్యాపార రంగంలో యువత స్వయంకృషితో రాణించాలని టిడిపి సీనియర్ నాయకులు ఉలిగయ్య తెలిపారు. ఆదివారం కౌతాళంలో టిడిపి యువ నాయకులు ముకయ్యకు చెందిన అంగడిని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వ్యాపార రంగంలో కూడా మంచి లాభాలు ఉన్నాయని, యువత ఈ రంగంపై దృష్టి సారించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. తెలుగు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వెంకటపతి రాజు, డాక్టర్ రాజానందు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడితో ఇబ్బందులు

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలో బావాజీ పేటలో తాగునీటి ఎద్దడి నెలకొని, ఇబ్బందులు పడుతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం టిడిపి వార్డు ఇన్‌ఛార్జ్, మాజీ కౌన్సిలర్ తిమ్మప్ప ఆధ్వర్యంలో కాలనీ మహిళలు ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా తిమ్మప్ప మాట్లాడారు. తాగునీరు సక్రమంగా సరఫరా చేయాలని మున్సిపాలిటీ అధికారులను కోరినా పట్టించుకోకపోవడంతో ఖాళీ బిందెలతో నిరసన చేపట్టినట్లు తెలిపారు. లైన్‌మేన్ సరిగ్గా సమాధానం ఇవ్వడం లేదని, ఆరు రోజులకోసారి తాగునీరు వదులుతున్నారని చెప్పారు. కేవలం అరగంట మాత్రమే వదిలి విద్యుత్ పోయిందంటూ చెబుతున్నారని అన్నారు. అధికారులు స్పందించి తాగునీరు సక్రమంగా వదలాలని కోరారు.

నిరసన తెలుపుతున్న మహిళలు

రజక కార్పొరేషన్ చైర్మన్‌గా సావిత్రి

ప్రజాశక్తి - హోళగుంద

కూటమి ప్రభుత్వం ప్రకటించిన నామినేటెడ్ పదవుల్లో భాగంగా ఆదోనికి చెందిన అడ్వకేట్ సావిత్రికి రాష్ట్ర రజక వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కింది. ఆదివారం ఆమెను హోళగుంద మండల రజకులు మర్యాదపూర్వకంగా కలిశారు. సావిత్రి అంచెలంచెలుగా ఎదుగుతూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా, ఉమ్మడి జిల్లా సెక్రటరీగా, ఉమ్మడి ఎలక్షన్ సెక్రటరీగా, రాష్ట్ర కోకన్వీనర్‌గా, పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారని తెలిపారు. ఆమె సేవలను గుర్తించిన ప్రభుత్వం చైర్మన్ పదవి కట్టబెట్టడం సంతోషంగా ఉందని చెప్పారు. సిఐటియు నాగరాజు, చిగిలి ఈరన్న, నెరణికి మడివళ నాగేంద్ర, శేఖర్, సున్నం వీరేష్, రాజా, కృష్ణ, మల్లి, రంగస్వామి, చిన్నసిద్ధప్ప, జెసిబి రాజా, నెరణికి మల్లికార్జున, ఈరన్న, ధనరాజు పాల్గొన్నారు.

సావిత్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న రజకులు

శబరిమలకు మహా సైకిల్ యాత్ర

ప్రజాశక్తి-ఆదోని

ఆదోని నుంచి శబరిమలకు మహా సైకిల్ యాత్రగా బయల్దేరినట్లు రమేష్ రెడ్డి తెలిపారు. పట్టణంలోని రిక్రియేషన్ క్లబ్ నుంచి ఆదివారం సైకిల్‌పై యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. శ్రీఅశ్వర్థ లక్ష్మీనారాయణ దేవాలయం నుంచి నాగనాథనతో ఇరుముడి కట్టుకుని ఆదోని నుంచి శబరిమలకు మహా సైకిల్ యాత్రగా బయల్దేరుతున్నామని తెలిపారు. ఆదోని నుంచి ఆస్పరి, గుత్తి హైవే రోడ్డు నుంచి అనంతపురం మీదుగా యాత్ర కొనసాగుతుందని చెప్పారు. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాన్ని చేరుకోనున్నట్లు తెలిఅపరు. సైకిల్ యాత్ర చేస్తున్న స్వాములకు కుటుంబ సభ్యులు, అయ్యప్ప స్వాములు పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు.

మహా సైకిల్ యాత్రగా బయల్దేరిన స్వాములు

భూ కబ్జాదారులపై కేసులేవి..?

- ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి నూర్ అహ్మద్

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని ఎస్‌కెడి కాలనీలో భూకబ్జాకు పాల్పడిన వారిపై నమోదైన కేసుల వివరాలను ప్రజలకు వివరించాలని ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి నూర్ అహ్మద్ ఎమ్మెల్యే పార్థసారథిని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆధార్ మార్ఫింగ్ చేసి రూ.కోట్ల విలువ చేసే భూమిని కబ్జా చేశారని, పెద్ద దుమారమే లేపిందని తెలిపారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇంతవరకు భూ కబ్జాకు పాల్పడిన వారు అరెస్టు కాలేదని చెప్పారు. దీనిని బట్టి చూస్తుంటే ఎమ్మెల్యే అండ ఉందన్న అనుమానాలు కలుగుతున్నాయన్నారు. భూ కబ్జాకు పాల్పడిన వారిని జైలుకు పంపి ఎమ్మెల్యే చిత్తశుద్ధిని చాటుకోవాలని డిమాండ్ చేశారు. మాటలు తప్ప అభివృద్ధి ఏమీ లేదన్నారు. ఆదోనిలోని ప్రయివేట్ హాస్పిటల్స్ అవినీతి గురించి గొంతెత్తుతున్న ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి వాటిపై కేసు నమోదు చేయకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. ప్రయివేట్ ఆస్పత్రులు ఆరోగ్యశ్రీ ద్వారా ప్రభుత్వ సొమ్మును అడ్డంగా బొక్కేశాయని ఎమ్మెల్యే ఆరోపిస్తుండడం నిజమైతే వాటిపై కేసు నమోదు చేసి డబ్బు రికవరీ చేసి నిజాయితీని నిరూపించుకోవాలని హితవు పలికారు. డాక్టర్ రవికిరణ్‌పై వచ్చిన భూకబ్జా అభియోగాలపై ఎలాంటి పెద్ద కేసులు పడకపోవడం ఎమ్మెల్యే పాత్రపై అనుమానంగా ఉందన్నారు. సామాన్యుడు చిన్నపాటి దొంగ తనం చేస్తే కేసులు నమోదు చేసి జైలులో పెట్టే వ్యవస్థలో.. ప్రయివేట్ ఆస్పత్రులు రూ.కోట్లు మింగాయని ఆరోపిస్తున్న ఎమ్మెల్యే కేసు నమోదు చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు.

మహారాజశ్రీ గౌరవనీయులైన సీనియర్ సివిల్ జడ్జ్ కోర్ట్
ఆదోని
దివాలా దావా No. 6/2018.

Between
T. ఇక్బాల్ S/O T. ఉస్సేన్ అహ్మద్.
వయస్సు 44 సం॥లు, వెజిటబుల్ మెర్చంట్
R/o. Door No.14/280,
ఖాజీపూర స్ట్రీట్ అదోని. ...పిటీషనర్

Versus

1) S.A. ఇస్మాయిల్ S/o. late. S.ఇబ్రహిం, ముస్లిం, మేజర్, R/o Door No.3/44, Gokarjanda స్ట్రీట్, ఆదోని.
2) M. యాహిమా బాషా S/o late మహమ్మద్ సాహెబ్, ముస్లిం, మేజర్, R/o. Door No.3/42-1, Gokarjanda స్ట్రీట్, ఆదోని.
3) S. నూర్ ఉన్నిస్స బెగువమ్, W/o S.A. ఇస్మాయిల్, ముస్లిం, మేజర్, R/o Door No.3/44, Gokarjanda స్ట్రీట్, ఆదోని.
4) M. ఫాతిమా బీ W/o M. యాహియా బాష, ముస్లిం, హౌస్ వైఫ్, మేజర్, R/o Door No.23/571, Gokarjanda స్ట్రీట్, ఆదోని.
5) N.అహమ్మద్ అలీ S/o late ముస్తాన్ సాహెబ్, ముస్లిం, మేజర్, R/o. Door No.14/229, ఖాజీపూర స్టేట్, ఆదోని.
6) B.అన్వర్ బాష S/o. బి.హాకీం సాబ్, ముస్లిం, మేజర్, R/O. Door No. 14/210, ఖాజీపూర స్ట్రీట్, ఆదోని.
7) S. అజీజ్ S/o S.అబ్దుల్ సలాం, ముస్లిం, R/O. Door No. 14/293, ఖాజీపూర స్ట్రీట్, మేయర్, ఆదోని.
8) బండి లక్షన్న S/o బండి నరసన్న, హిందూ, మేజర్, R/o. Door No. 20/397, వెంకన్నపేట స్ట్రీట్, ఆదోని.
...రెస్పాండెంట్స్

జనరల్ నోటీసు టు పబ్లిక్

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడ మేమనగా పైన తెలిపిన పిటీషనర్ అయిన T. ఇక్బాల్ S/o T.ఉస్సేన్ అహమద్, గౌరవనీయులైన సీనియల్ సివిల్ జడ్జి కోర్ట్, ఆదోనిలో దివాలా దావా దాఖలు చేసియున్నారు. కావున ఎరికైనా ప్రతివాదులు అక్షేపణలు మరియు అభ్యంతరములు గాని వున్న యెడల తేది: 27/12/2024న ఉదయం 10.30 am గంటలకు పై కోర్టు ముందు స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు తెలుపవచ్చును ఎవ్వరూ హాజరు కానియెడల పై కోర్టు వారు కేసును దివాలా దారునిగా తీర్మానించబడును.

ఇట్లు కోర్టు వారి ఉత్తర్వులు మేరకు

వాయిదా తేదీ : 27-12-2024

కె.శ్రీధర్
అడ్వకేటు,
ఆదోని.
సెల్ : 9705841725

ఎంపీ బస్తిపాటి నాగరాజును కలిసిన దేవేంద్రప్ప

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్



కురువకార్పోరేషన్ చైర్మన్‌గా ఎన్నికైన మాన్వి దేవేంద్రప్ప కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజును మర్యాద పూర్వకంగా కలిశారు. నగరంలోని ఎంపి కార్యాలయంలో ఆయనను కలిసిన దేవేంద్రప్ప శాలువ కప్పి సత్కరించారు. తనకు కార్పోరేషన్ చైర్మన్ పదవి రావడానికి సహకరించిన ఎంపి నాగరాజుకు కృతజ్ఞతలు తెలిపారు..

పాణ్యం నియోజకవర్గ సమన్వయకర్తగా లక్ష్మీ నరసింహ యాదవ్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

నంద్యాల పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు జంగిటి లక్ష్మి నరసింహయాదవ్ కు పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఎపిసిసి అధ్యక్షురాలు వై.ఎస్ షర్మిలారెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా మరో 50 మందిని కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్తలుగా నియమిస్తూ జాబితాను విడుదల చేశారు. ఈ సందర్భంగా జంగిటి లక్ష్మి నరసింహయాదవ్ వైఎస్ షర్మిలారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఆ పార్టీ జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ సంజీవ కుమార్ , పలువురు కాంగ్రెస్ నాయకులు నరసింహ యాదవ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

టౌన్ మోడల్ లో లూసిడ క్యాలిగ్రఫీ వర్క్ షాప్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు టౌన్ మోడల్ పాఠశాలలో ఇఎల్‌టి క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం లూసిడ క్యాలిగ్రఫీవర్క్‌షాప్ నిర్వహించారు. డిఇఒ ఎస్.శామ్యూల్ పాల్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఈ శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గుంటూరు నుండి విచ్చేసిన పరిశీలకులు రామ్మోహన్ లూసిడ చేతి రాతకు సంబంధించి ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఇఒ హనుమంత రావు , నిర్వాహకులు సోమ శేఖర్, మజాహర్ హుస్సేన్, శాంతి ప్రియ, వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కుడా చైర్మన్ కు అభినందనలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కుడా చైర్మన్‌గా నియమితులైన సోమిశెట్టి వెంకటేశ్వర్లను ఆదివారం హుసేనాపురం వాటర్ షెడ్ కమిటీ చైర్మన్ చంద్ర, పెద్దస్వామి మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. రెండోసారి కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లుకు రావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు పెద్దస్వామి పేర్కొన్నారు.

రాష్ట్ర పురుషుల షూటింగ్ బాల్ విజేత పల్నాడు

బహుమతులు అందజేసిన గుడ్ షెపర్డ్ పాఠశాల కరస్పాండెంట్ ఏసుదాస్

ప్రజాశక్తి-కర్నూలు జిల్లాపరిషత్

గత రెండు రోజులుగా జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి సీనియర్ పురుషుల షూటింగ్ బాల్ విజేతగా పల్నాడు జిల్లా నిలిచింది. రెండో రోజు పోటీల ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథి గుడ్ షెపర్డ్ ఇంగ్లీష్ స్కూల్ కరస్పాండెంట్ ఏసుదాస్ క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. గెలుపోటములు సమానంగా తీసుకోవాలన్నారు. క్రమశిక్షణ కలిగిన వారే అత్యున్నత స్థాయిలో రాణించగలరని, విద్యార్థి దశలోనే మన భవిష్యత్తుకు బంగారు బాట వేసుకోవాలని తెలిపారు. విశిష్ట అతిథిగా హాజరైన కర్నూలు జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.రామాంజనేయులు క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగిస్తూ క్రీడాకారులు తమకు నచ్చిన రంగంలో రాణించేలా కృషి చేయాలని, చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్యమని, క్రీడలను నిత్యం సాధన చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ప్రత్యేక అతిథిగా హాజరైన కళ్ళ నాగ వేణి రెడ్డి క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగిస్తూ ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రోత్సహించడానికి తాను ఎల్లప్పుడూ ముందుంటానన్నారు. విద్యార్థి దశలో తనకు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలలో పాల్గొన్న అనుభవం ఉందన్నారు. సీనియర్ పురుషుల విభాగంలో విజేతగా పల్నాడు జిల్లా, ద్వితీయ స్థానంలో ఎన్‌టిఆర్ జిల్లా, తతీయ స్థానంలో అన్నమయ్య జిల్లా నిలిచినట్లు పోటీల నిర్వాహకుడు నాగరాజు తెలిపారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు , ఆంధ్రప్రదేశ్ షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పరుశరాముడు , పోటీల నిర్వాహకుడు నాగరాజు సభ్యులు కిరణ్ కుమార్, పరమేశ్వర్ రెడ్డి, మధు, సుభాన్‌బాష, జిల్లా యోగా సంఘం కార్యదర్శి ప్రభాకర్ పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

ట్రోఫీని అందజేస్తున్న గుడ్ షప్పర్డ్ కరస్పాండెంట్ ఏసుదాసు

ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పేరుతో నకిలీలు

సంఘం జిల్లా అధ్యక్షుడు బంగిశ్రీధర్

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

గతంలో నిబంధనల మేరకు సంఘం చేత తొలగింపబడిన వ్యక్తులు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పేరుతో జిల్లాలో ఏర్పాటు చేస్తున్న నకిలీ సమావేశాలకు ఎటువంటి అధికారత లేదని కర్నూలు జిల్లా అధ్యక్షులు బంగి శ్రీధర్ స్పష్టం చేశారు. కర్నూలు బి క్యాంప్ కార్యాలయంలో ఆదివారం జిల్లా సెక్రటరీ సురేష్‌రెడ్డి, సిటీ అధ్యక్షులు మురళీధర్ నాయుడు, సిటీ సెక్రటరీ చెన్నకృష్ణ లతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శ్రీకాంత్ రాజు అధ్యక్షుడిగా ఆస్కార్‌రావు ప్రధాన కార్యదర్శిగా వారికి వారే ప్రకటించుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పేరును లోగోను, గుర్తింపును వాడుకోవడం వారి చేతగాని తనానికి నిదర్శనమని పేర్కొన్నారు. వారికి దమ్ము ధైర్యం ఉంటే కొత్త సంఘం ఏర్పాటు చేసి తమ బలమేంటో ఉద్యోగ సమాజంలో నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. రాష్ట్రంలోని 26 జిల్లాల అధ్యక్ష కార్యదర్శులతో 2022లో రాష్ట్ర అధ్యక్షులు కెఆర్ సూర్యనారాయణ నేతృత్వంలో ఏర్పడిన సంఘానికి, ఇప్పటి సమావేశాలు ఏర్పాటు చేసుకున్న నకిలీ సంఘానికి ఎటువంటి సంబంధం లేదన్నారు. 2010లో రిజిస్టర్ అయిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సంఘం ఏర్పాటులో శ్రీకాంత్ రాజుకు, ఆస్కార్ రావుకు ఎటువంటి పాత్ర లేదన్నారు. అనేక కారణాల చేత సస్పెండ్ అయి ఇంట్లో కూర్చున్న ఆస్కార్ రావును రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవి ఇచ్చి గౌరవించిన కెఆర్.సూర్యనారాయణను వెన్నుపోటు పొడిచారన్నారు. వైసిపి ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులు ఎదుర్కొంటున్న సమయంలో, వైసిపి ప్రభుత్వ పెద్దలతో కలిసి కెఆర్ సూర్యనారాయణ అధ్యక్ష పదవికి ఎసరు పెట్టారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఇప్పుడు ఆస్కార్‌రావు ఒడి సౌకర్యం తొలగించడానికి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నుంచి తొలగించబడటమే కారణమన్నారు. కెఆర్ సూర్యనారాయణ నేతృత్వంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘాన్ని చీల్చి లబ్ది పొందాలనుకుంటున్న నకిలీ నాయకులతో జాగ్రత్తగా ఉండాలని ఉమ్మడి కర్నూలు జిల్లా ఉద్యోగులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉద్యోగ సంఘం నాయకులు పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వంతో కార్యకర్తలకు గుర్తింపు భరోసా

కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

మంత్రి టిజి.భరత్ ఆదేశాల మేరకు టిడిపి నాయకులు కౌశిక్ ఆధ్వర్యంలో నగరంలోని ఎన్ఆర్.పేటలో నిర్వహించిన టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమానికి టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కర్నూలు పార్లమెంట్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆకెపోగు ప్రభాకర్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వరరావు యాదవ్ హాజరయ్యారు. సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ టిడిపి వ్యవస్థాపకులు నందమూరి తారకరామారావు తరువాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పార్టీని ముందుకు తీసుకు వెళుతూ అన్ని వర్గాల ప్రజల ఆదరాభిమానాలు పొందుతున్నారన్నారు. ఇప్పటికి 70 లక్షల సభ్యత్వంతో బలమైన పార్టీగా ఎదిగిందన్నారు. ప్రతి కార్యకర్త చెల్లించిన సభ్యత్వ రుసుం మొత్తం తిరిగి కార్యకర్తలకు లబ్ధి చేకూరే విధంగా మన యువనేత నారా లోకేష్ సరికొత్తగా ఆలోచించి ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. చనిపోయిన ప్రతి ఒక్కరికి గతంలో రూ.రెండు లక్షల ఇన్సూరెన్స్ చెల్లించేవారని, ని 5,00,000గా పెంచడం ఒక భరోసాగా చెప్పవచ్చన్నారు. అంతేకాక మట్టి ఖర్చుల నిమిత్తం రూ.పదివేలు తక్షణ సహాయం కూడా అందిస్తున్నారన్నారు. కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గం ప్రజల ఆశీర్వాదం వల్ల టిజి భరత్ ఎమ్మెల్యేగా గెలిచి రాష్ట్ర మంత్రిగా అయ్యారన్నారు.

టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు

నేడు గ్రీవెన్స్ కార్యక్రమం

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యలు పరిష్కార వేదిక గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని రెవెన్యూ మున్సిపల్ మండల కేంద్రాల్లో గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. బాధితులు నేరుగా వచ్చి తమ సమస్యలను విన్నవించుకోవాలని కోరారు.

ప్రత్యేక ఓటరు కార్యక్రమం విజవంతం

ప్రజాశక్తి-సి బెళగల్

మండలంలో శని,ఆదివారం బిఎల్ఓలు చేపట్టిన ప్రత్యేక ఓటరు కార్యక్రమం విజయవంతం అయినట్లు తహసీల్దార్ శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఫారం -6కు 14, ఫారం - 7 కు 2, ఫారం - 8 కు 1 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. ఓటు ప్రతి పౌరుని హక్కు అని యువకులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కోరారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు మృతి

ప్రజాశక్తి-నందవరం

రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు యువకులు మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి కర్నూలు జిల్లా నందవరం మండలం ధర్మాపురం గ్రామ సమీపాన జరిగింది. ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొని అక్కడికక్కడే ఇద్దరు మృతి చెందారు. మృతుల్లో ఒకరు పెద్దకడబూరు మండలం జాలవాడి గ్రామానికి చెందిన బజారి కుమారుడు దావీదు (18), మరొకరు ఎమ్మిగనూరు మైనార్టీ కాలనీ చెందిన ఇర్ఫాన్ (20) మరణించినట్లుగా గుర్తించారు. పెద్దకడబూరు మండలం జాలవాడి గ్రామానికి చెందిన వంశీ అనే యువకుడి పరిస్థితి విషమం విషమంగా ఉంది. ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూల్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. నందవరం పోలీస్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి- వెల్దుర్తి :

వెల్దుర్తి లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 2003-2004వ సంవత్సరం పదవ తరగతి పూర్తి చేసుకుని 20 సంవత్సరాల తర్వాత తమకు విద్యను అభ్యసించిన గురువులను, వారితో పాటు కలిసి చదువుకున్న మిత్రులను కలుసుకున్నారు. అనంతరం వారికి చదువు చెప్పిన ఉపాధ్యాయులకు పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. మిత్రులను కలిసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని వారి స్థితిగతులను తెలుసుకున్నారు. 20 యేళ్ల తర్వాత కలుసుకున్నందుకు

చాలాసంతోషంగా ఉందని తెలిపారు. అప్పటి ప్రధానోపాధ్యాయులు పద్మశ్రీ, షబానా, చంద్రశేఖర్, శోభాదేవి, ఫాతిమా, విశ్వేశ్వరయ్య, శ్రీనివాసులు, రఫీక్, నాగన్న, వెంకటేశ్వర్లు, ప్రభాకర్, పూర్వవిద్యార్థులు సుధాకర్, శ్రావణ్, లక్ష్మన్న, శీను, నాగిరెడ్డి, హరికృష్ణ, జాకీర్, సంజీవ పాల్గొన్నారు.